క్లుప్తంగా

కోల్‌కతా ఘటనకు నిరసనగా శాంతి ర్యాలీ


జగ్గంపేటలో శాంతి ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

జగ్గంపేట: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటనకు నిరసనగా జగ్గంపేటలో శుక్రవారం విద్యార్థినులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కోల్‌కతా ఘటనలో నిందితులను శిక్షించడంలో అక్కడి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, తక్షణమే ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

ప్రత్తిపాడు: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు జంధ్యం అప్పలరాజు, తుమ్మూరి రామకృష్ణ, ఎస్వీ పద్మజానాయుడు దంపతులను శుక్రవారం స్థానిక లయన్స్‌క్లబ్ కమ్యూనిటీ హాలు ఆవరణలో మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సత్కార సభకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు, యూటీఎఫ్ అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు, సంఘ నాయకులు రాపర్తి రామలింగేశ్వరరావు, జీవీ రమణ, చుక్కల వీర గణేష్, సీఆర్పీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇ.రాంజీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అంతరిక్ష పరిజ్ఞానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ మెహర్ ఆధ్వర్యంలో అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దివాకరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాము తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్టు స్థానిక ఎస్సై యువి శివ నాగబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని చక్రవర్తి నగర్‌లో నివాసం ఉంటున్న బొక్క సత్యసాయమ్మలు ఈ నెల 1న ఉదయం తన ఇంటికి తాళం వేసి దేవరపల్లిలో ఉంటున్న తన చిన్నకొడుకు వద్దకు వెళ్లింది. శుక్రవారం సాయంత్రం తన ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. అనుమానం వచ్చి చూడగా బీరువాలోని నగదు, బంగారు చెవి దుద్దులు, బంగారు పూసలతాడు వెరసి మొత్తం కాసున్నర బంగారం చోరీకి గురైనట్టు గుర్తించింది. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

కాకినాడ క్రైం: కాకినాడ బీచ్ రోడ్డులో ఇద్దరు గంజాయి విక్రేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీహార్‌కు చెందిన రవీంద్రయాదవ్, రాజేష్‌ఠాగూర్ గంజాయిని చిన్న పొట్లాలుగా విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో కాకినాడ పోర్టు పీఎస్ సీఐ సునీల్ కుమార్ బృందం దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలి



సమాజంలోని పేదలకు సేవ చేయాలనే ధ్యేయంతో వైద్య వృత్తిని ఎంచుకున్నాం. కోల్‌కతాలో ఇటీవల జరిగిన ట్రైనీ డాక్టర్ హత్యాచారం ఘటన వైద్యరంగాన్నే కలచివేసింది. ఇటువంటి సంఘటనలు పునరావృతం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రతి ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డులను నియమించాలి. అన్ని శాఖల నుంచి మండల స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి మహిళల రక్షణకు చర్యలు తీసుకోవాలి. డాక్టర్లు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేలా ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు చేయాలి.

– వి.అరుణ, వైద్యురాలు, వీరవరం ప్రభుత్వాసుపత్రి, కిర్లంపూడి



ఆసుపత్రుల్లో నిఘా పెంచాలి



కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార తీవ్ర ఆవేదనకు గురి చేసింది. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24/7 నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. అత్యవసర విభాగం, పిల్లల వార్డులు, గర్భిణుల వార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఆసుపత్రి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఆసుపత్రి పరిసరాలను పర్యవేక్షించాలి. ఆధునిక యూప్‌లు రూపొందించి రక్షణ కల్పించాలి. దాడి జరిగే అవకాశం ఉంటే వెంటనే యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చే విధంగా ఉండాలి. రాత్రి సమయంలో పని చేసే సిబ్బందికి ప్రత్యేక భద్రత సిబ్బంది కల్పించాలి.

– ఎస్.స్వప్న, డీసీహెచ్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, తుని

మోతాదుకు మించితే ముప్పే

- వరిలో ఎరువుల యజమాన్యం కీలకం
- అవసరం మేరకే వినియోగిస్తే మంచి ఫలితాలు
- మితిమీరిన ఎరువుల వాడకంతో పంటలకు నష్టం
- సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలంటున్న వ్యవసాయాధికారులు


అల్లిపూడిలో నారు తీస్తున్న మహిళా రైతుకూలీలు

కోటనందూరు: అల్పపీడనం ప్రభావంతో ఇటీవల విస్తారంగా వర్షాలు కురవడంతో మెట్టలో ఖరీఫ్ వరిసాగు జోరుగా సాగుతోంది. రైతులకు ఆదాయంతో పాటు ఆరోగ్యాన్ని ఇచ్చే ఖరీఫ్ వరిసాగులో ఎరువుల యాజమాన్యం ఎంతో కీలకం. భూసార పరీక్షల ఆధారంగా నేల పరిస్థితిని బట్టి ఎరువులను అవసరం మేర వినియోగిస్తే ఆశించిన ఫలితాలు సాధించవచ్చు. మితిమీరిన ఎరువుల వినియోగంతో ఆరోగ్యంతో పాటు ఆశించిన దిగుబడులు కూడా కోల్పోయే ప్రమాదముందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎరువుల వినియోగంలో వ్యవసాయాధికారులు సూచనలు, సలహాలు పాటిస్తే తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు వస్తాయి. రైతులు ఎరువుల యాజమాన్యంపై అవగాహన పెంచుకుని పంటల సాగులో మంచి దిగుబడులు సాధించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

40 వేల ఎకరాల్లో వరిసాగు

తుని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఈ ఏడాది 40 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరిసాగు చేసే అవకాశం ఉంది. ఖరీఫ్ ప్రారంభంలో ఓ మోస్తరుగా కురిసిన వర్షాలకు రైతులు నారుమడులను సిద్ధం చేశారు. నెల రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రైతులు జోరుగా నాట్లు వేస్తున్నారు. తుని సబ్‌డివిజన్ పరిధిలో ఇప్పటికే 80 శాతం విస్తీర్ణంలో నాట్లు వేసినట్లు వ్యవసాయాధికారుల అంచనా. ముందుగా నాట్లు వేసిన రైతులు ఒకపక్క పంట ఏపుగా ఎదగడానికి, మరోపక్క తెగుళ్లు, కలుపు నివారణకు ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరి సాగులో యూరియా, డీఏపీతో పాటు పొటాష్‌ను తగిన మోతాదులో వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఎకరం పొలానికి ఎరువులు కింది విధంగా వాడాలని వారు చెబుతున్నారు.

ప్రధాన ఎరువుల వినియోగం ఇలా..

ఎకరం పొలానికి 5 సెంట్ల విస్తీర్ణంలో నారుమడి తయారు చేసుకోవాలి. విత్తనాలు చల్లిన తరువాత నాలుగు కేజీల డీఏపీ, రెండు కేజీల యూరియా, కేజీ పొటాష్ కలిపి వేస్తే ఆకు ఏపుగా ఎదుగుతుంది. మొదటి దమ్ములో మూడు బస్తాల సూపర్, బస్తా డీఏపీ, నాట్లు వేసే ముందు 35 కేజీల యూరియా, 12 కేజీల పొటాష్ కలిపి వాడాలి. పొలం ఉడిచిన 45 రోజుల తరువాత 45 కేజీల యూరియా, 12 కేజీల పొటాష్ వేసుకోవాలి. పొట్ట దశలో మరో 35 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ కలిపి వాడాలి. 60 రోజుల వ్యవధిలో 35 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ చొప్పున వేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

పొటాష్ లోపంతో ప్రమాదం

సాధారణంగా రైతులు వరిసాగులో యూరియా డీఏపీలకు అధిక ప్రాధాన్యమిస్తూ పొటాష్ వినియోగంపై ఆసక్తి చూపడం లేదు. పొటాష్ లోపం కారణంగా గింజ గుల్లబారి బరువు తగ్గిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు సాగులో పొటాష్ వినియోగంపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. పొటాష్ వినియోగాన్ని పట్టించుకోకపోతే రైతుల భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

సేంద్రియ ఎరువులతో మేలు

తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు ఇచ్చే సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మితిమీరిన రసాయనిక ఎరువుల వాడకంతో అనారోగ్య దిగుబడులతో పాటు నేల నిస్సారమైపోతుందని హెచ్చరిస్తున్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన అవసరం



వరి సాగులో ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలి. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సమావేశాలు ఏర్పాటు చేసి ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. సమగ్ర ఎరువుల యాజమాన్యంతో ఖరీఫ్ సాగులో మంచి దిగుబడులు వస్తాయి. వ్యవసాయశాఖ సిబ్బంది సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. సేంద్రియ ఎరువుల వైపు రైతులు అడుగులేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

– కేజీ చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి, కోటనందూరు.

పంట పొలాల పరిశీలన


కేపీ మల్లవరంలో నాట్లు వేయడంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శివకుమారి

కోటనందూరు: ఖరీఫ్ సాగులో మోతాదుకు మించి పురుగు మందులను వినియోగిస్తే పంటలకు నష్టం కలుగుతుందని వ్యవసాయ విస్తరణాధికారి కేవీ శివకుమారి అన్నారు. మండలంలోని కోటనందూరు, కేపీ మల్లవరం, పాతకొట్టాం గ్రామాల్లో నాట్లు వేస్తున్న వరి పొలాలను శుక్రవారం ఆమె సందర్శించారు. నాట్లు వేస్తున్న విధానాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారు తీసేటప్పుడే సుతలు(చివర్లు) తుంచి నారు కట్టకట్టాలన్నారు. సుతలు తుంచి నాట్లు వేసిన పొలంలో 40 రోజుల వరకూ ఎటువంటి తెగుళ్ల ప్రభావం ఉండదన్నారు. రైతులు నాట్లు వేసిన నాలుగైదు రోజులకే కాండం తొలుచు పురుగు నివారణకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారన్నారు. ఇలా చేయడం వల్ల రైతులకు రూ.2 వేల వరకూ అదనపు ఖర్చుతో పాటు పంటకు నష్టం కలుగుతుందని వివరించారు. అవసరం మేర మాత్రమే పురుగు మందులు, రసాయన ఎరువులు వినియోగించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి


మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

- మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి
- తునిలో కౌన్సిల్ సమావేశం

తుని: పట్టణాభివృద్ధికి కౌన్సిలర్లు, అధికారులు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. అజెండాలోని 52 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. పట్టణంలోని సమస్యలను పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జాతీయ రహదారిపై ఉడిపి హోటల్ వద్ద డ్రైన్‌లో పూడిక తీత పనుల విషయాన్ని అధికారులు తమ దృష్టికి తీసుకురాలేదని కౌన్సిలర్ వాసంశెట్టి శ్రీను చైర్‌పర్సన్‌కు వివరించారు. కొండవారిపేటలో చేతిపంపు ఏర్పాటు విషయంలో తనకు తెలియ పరచలేదని వార్డు కౌన్సిలర్ కర్రి సత్య జగదీష్ అన్నారు. గవరపేట శివాలయం వీధిలో చిన్నపాటి వర్షానికి నీరు నిలిచిపోయి ఇబ్బందికరంగా ఉంటుందని కౌన్సిలర్ కర్రి శ్రీదేవి అన్నారు. పలు సమస్యలను కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వార్డుల్లో చేపట్టే పనుల వివరాలను ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లకు తెలియ పరచాలని చైర్‌పర్సన్ సుధారాణి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈఈ ప్రకాశరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఏలేశ్వరం: శ్రావణమాసంలో మూడో శుక్రవారం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆర్టీసీ కాంప్లెక్స్, తోటవీధి, మార్కెట్ వీధి, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల్లోని ఆలయాల వద్ద మహిళలు సందడి చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. మండలంలోని సిరిపురంలో పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరాస్వామి వారి ఆలయంలో అమ్మవారికి మహిళలు సారెతో పాటు పలు రకాల పిండివంటలు నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పారాయణ పఠనం చేశారు.

సర్వఫలప్రదాయిని అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని మహాలక్ష్మి అమ్మవారు శుక్రవారం సర్వఫలప్రదాయిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసంలో మూడో శుక్రవారం కావడంతో పండితులు అమ్మవారికి విశేషలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నవ కలశాల పంచామృతాలతో అభిషేకాలు, స్వర్ణ పుష్పార్చన, సామూహిక వరలక్ష్మీ కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


సిరిపురంలో పారాయణ చేస్తున్న మహిళలు

ఆంధ్రా భద్రాద్రిలో సామూహిక కుంకుమార్చనలు

ప్రత్తిపాడు: స్థానిక నరేంద్రగిరిపై గల ఆంధ్రా భద్రాద్రి శ్రీరామనామ క్షేత్రంలో వేంచేసిన వరలక్ష్మీ అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో మూడో శుక్రవారం కావడంతో మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రామకోటి సుబ్బారావు, గోగుల వెంకటేశ్వరరావు, పత్రి రమణ, చాట్ల పుష్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రత్తిపాడు ఆంధ్రా భద్రాద్రి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న భక్తులు

ప్రశాంతంగా ఉపాధి గ్రామ సభలు

- గ్రామాల్లో చేపట్టే పనుల గుర్తింపు
- కూలీలకు 100 రోజులు పని కల్పించేలా ప్రణాళికలు

ఏలేశ్వరం/శంఖవరం/కిర్లంపూడి/గండేపల్లి/రౌతులపూడి/కోటనందూరు/జగ్గంపేట/ప్రత్తిపాడు రూరల్/తొండంగి/గోకవరం/ప్రత్తిపాడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను గుర్తించేందుకు శుక్రవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఏలేశ్వరం మండలం యర్రవరంలో జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వందరోజుల పనిదినాలు కల్పించాలన్నారు. అర్హత ఉన్నవారికి జాబ్‌కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జ్యోతుల పెదబాబు, మైరాల కనకరావు తదితరులు పాల్గొన్నారు.


యర్రవరం గ్రామసభలో ఎలుకల నివారణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని పలు పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభల్లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల పరిశుభ్రతకు సీసీ డ్రైన్లు, సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణాలతో పాటు రైతులకు సంబంధించిన పంట కాలువల తవ్వకాలు, మొక్కల పెంపకం వంటి పనులు గుర్తించినట్లు తెలిపారు.


సోమవరం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

రౌతులపూడి మండలంలో..

మండలంలోని 26 పంచాయతీల్లో ఆయా గ్రామ సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. మౌలిక సదుపాయాల కల్పన, నీటి సంరక్షణ, వ్యవసాయ అనుబంధ పనులకు సంబంధించి 49 రకాల పనులు ఉపాధి హామీ పథకం ద్వారా కల్పిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం రైతులు, కూలీల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ఘనంగా చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు కోట వంశీ, వ్రతపురోహితులు దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. దేవస్థానం డిప్యూటీ ఈఓ రమేష్ బాబు పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్శింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

నీటిశుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు

సామర్లకోట: మున్సిపాలిటీల పరిధిలో నీటి శుద్ధీకరణ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్డీఓ ఇట్ల కిశోర్ శుక్రవారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మురుగునీటి శుద్ధి జాలల ప్లాంటు నిర్వాహణకు అవసరమైన స్థల సేకరణను ఆయన పరిశీలించారు. కాకినాడ, సామర్లకోట, పిఠాపురం మున్సిపాలిటీలలో, గొల్లప్రోలు నగర పంచాయతీలలో ఈ మేరకు స్థల సేకరణ చేస్తున్నట్టు తెలిపారు. భూసేకరణ ప్రతిపాదనలు కలెక్టరుకు నివేదించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం వేట్లపాలెంలోని బాణసంచా తయారీ దుకాణాలను తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, మున్సిపల్ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.


వేట్లపాలెంలోని బాణ సంచాతయారీ దుకాణాలను తనిఖీ చేసిన ఆర్డీఓ కిషోర్ తదితరులు

ఏఆర్వీ ఉందిగా.. ఫరవాలేదు!

- కుక్కల దాడులపై అధికారుల తీరిదీ
- వాటి సంతతి నియంత్రణలో విఫలం
- ఆందోళన కలిగిస్తున్న కుక్క కాట్ల కేసులు

పిఠాపురం: గ్రామ సింహాలు గర్జిస్తున్నాయి. తమను చంపే అధికారం ఎవరికీ లేదనుకుంటున్నాయో ఏమో దొరికిన వారందరిపైన దాడులు చేస్తున్నాయి. ఫలితంగా అనేక మంది కుక్కకాట్లకు గురై ప్రాణాపాయస్థితిలో వైద్య కోసం ఎదురుచూస్తున్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఏఆర్వీ ఇంజెక్షన్లు కొరత లేకుండా చూడడం తప్ప కుక్కకాటు నివారణ చర్యలు తీసుకోవడం లేదు. మీరు కుక్కతో కరిపించుకు రావడమే తరువాయి మేము ఇంజక్షన్ చేస్తాం అంటున్నట్లుగా ఉంది అధికారుల తీరు. కుక్కల నియంత్రణపై దృష్టి పెట్టకుండా ఏఆర్వీ కొరత లేకుండా చూస్తే చాలన్నట్టుంది అధికారుల తీరు. నియోజకవర్గ పరిధిలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో వివిధ గ్రామాల్లో కుక్కల బెడద రోజురోజుకి పెరుగిపోతుంది. జిల్లాలో అనేక మంది కుక్కకాటుకు గురై మృత్యువాత పడగా హడావుడి చేసిన అధికారులు మళ్లీ పట్టించుకోవడం మానేసారు. నియోజకవర్గ పరిధిలో నిత్యం 35కు పైగా కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. పిఠాపురంలో సీహెచ్‌సీ, కొత్తపల్లి, విరవ, గొల్లప్రోలు, కొమరగిరి, పీహెచ్‌సీల్లో ఏఆర్వీల కొరత లేనప్పటికీ కుక్క కాట్లు మాత్రం ఆందోళన కలిగిస్తున్నాయి.

నియోజకవర్గంలో ఆస్పత్రులు

సీహెచ్‌సీ	1
యూపీహెచ్‌సీలు	3
పీహెచ్‌సీలు	7
వీధి కుక్కలు	34 వేలకు పైనే
కుక్క కాటు బాధితులు	నెలకు సుమారు 300 పైగా...

గర్భనిరోధక చర్యలు శూన్యం

కుక్కలకు గర్భనిరోధక చర్యలు తీసుకోకపోవడంతో ప్రతి గ్రామంలోనూ వాటి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. కుక్కలను చంపకూడదన్న నిబంధనలు ఉండడంతో వాటి సంతతి భారీగా వృద్ధి చెందుతూ ప్రజలు, పిల్లలపైనా, పాదచారులు, వాహన చోదకులపైనా పడి దాడి చేస్తూ ప్రాణాంతకంగా మారుతున్నాయి.

పెరిగిన కుక్కల సంతతి

గడిచిన ఏడాదిగా నియోజకవర్గంలో సుమారు 50 వరకు గేదె దూడలు కుక్కకాటు వల్ల చనిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ఒక్క గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో విలువైన 20 గేదె దూడలపై దాడి చేసి చంపేసినట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క పిఠాపురం మున్సిపాలిటీలోనే సుమారు 2 వేలకు పైగా కుక్కలున్నాయంటే పరిస్థితి అర్థమవుతుంది.

ఆపరేషన్లు చేస్తే దాడులు ఆగుతాయా?

ఆపరేషన్లు చేస్తే కుక్కల సంతతి వృద్ధి చెందకుండా ఉంటుంది తప్ప దాడులు ఆగే పరిస్థితి కనిపించడం లేదు. ఒకవేళ కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయాలంటే ముందుగా వాటిని బంధించడానికి బోన్లు ఏర్పాటు చేయాలి. ఒక్కో బోనులో ఐదు కుక్కలను మాత్రమే తీసుకెళ్లి ఆపరేషన్ చేసే వీలుంటుంది. అలాగే వాటికి ఆపరేషన్ పూర్తయ్యాకా సుమారు ఐదు రోజులు వాటిని గమనిస్తూ అవసరమైతే వైద్య సేవలందించాలి. అప్పటి వరకు ఆ కుక్కలను బోనులోనే ఉంచాలి. అలా ఐదు రోజుల వరకు బోనులు ఖాళీ కాకపోతే గ్రామాల్లో ఉన్న వందల కుక్కలకు ఆపరేషన్లు పూర్తి కావాలంటే కొన్ని నెలలు పడుతుంది. ఇంతలో సుమారు 100 కుక్కలు సంతానోత్పత్తి చేసినా ఒక్కో కుక్క సగటున నాలుగు పిల్లలను పెట్టినా మరో నాలుగు వందల కుక్కలు పెరుగుతాయి.


విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలు


కుక్కల దాడిలో గాయపడిన బాధితుడు (ఫైల్)

సమస్యలు లేకుండా ఇసుక విధానం

కాకినాడ సిటీ: ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్‌మీనా అమరావతి నుంచి ఉచిత ఇసుక విధానంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జేసీ రాహుల్ మీనాతో కలిసి ఆయన హాజరయ్యారు. అనంతరం అధికారులతో ఆయన సమీక్షించి ఇసుక లభ్యత, వినియోగంపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్